బాబూ.. భృతి ఎక్కడ?

- నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు
- భృతి విధి, విధానాలు రూపొందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- నెలకు రూ.3వేలు భృతి ఇస్తామని కూటమి హామీ
- నగరంలో రెండు లక్షల మంది నిరుద్యోగులు
- ఉద్యోగాల కోసం కోచింగ్‌లు తీసుకుంటున్న యువత
- భృతి ఇస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చనే ఆశ



కూటమి సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యత అయిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

గుంటూరు ఎడ్యుకేషన్‌: నిరుద్యోగ భృతిపై ప్రభుత్వ కప్పదాటు వైఖరి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లవుతోంది. అధికారంలోకి రాగానే యువతకు లక్షలాది ఉద్యోగాలను కల్పిస్తామని, లేకుంటే ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ.3వేలు భృతి ఇస్తామని ఎన్నికల్లో గుప్పించిన హామీ ఎప్పుడు నెరవేర్చుతారో తెలియని పరిస్థితి నెలకొంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రధానంగా ప్రకటించిన సూపర్ సిక్స్‌లో మొదటిది యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన, లేదా నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని చేసిన వాగ్దానాన్ని అమలు చేసే దిశగా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. గుంటూరు నగరంలోని వివిధ కోచింగ్ సెంటర్లలో ప్రస్తుతం డీఎస్సీ, టెట్ కోసం నిరుద్యోగ యువత కోచింగ్ పొందుతున్నారు. ఇందు కోసం వీరు ప్రతి నెలా రూ. వేలల్లో వెచ్చిస్తున్నారు. సొంత ఊళ్ల నుంచి డీఎస్సీతో పాటు పోలీస్ కానిస్టేబుల్, ఏపీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్ల ఆధారంగా వివిధ ఉద్యోగాలకు సన్నద్ధం కావడం నిరుద్యోగులకు తలకు మించిన భారంగా మారింది. స్టడీ సర్కిళ్లతో పాటు కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల్లో ప్రస్తుతం పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గుంటూరు నగర పరిధిలో రెండు లక్షలకు పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంది.

నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారు



అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీని ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఇప్పటి వరకు స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగం ఇచ్చే లోపు భృతి ఇస్తామని చేసిన వాగ్దానం మేరకు తక్షణమే నిరుద్యోగ భృతికి సంబంధించిన విధి విధానాలు ప్రకటించాలి. గతంలో మాదిరిగా అధికారంలో నుంచి దిగిపోయే ముందు కంటి తుడుపు చర్యగా దాటవేయాలని చూస్తే సహించలేది లేదు.

– షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, తూర్పు నియోజకవర్గం.

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం



బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాను. గ్రూప్-2తో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. కోచింగ్‌కు వేలాది రూపాయలు ఫీజులు కట్టాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీ వల్ల.. నాతో పాటు ఎంతో మంది యువత దీని కోసం ఎదురు చూస్తోంది. తక్షణమే దీనిపై నిర్ణయం ప్రకటించాలి.

– రవితేజ, గుంటూరు.

ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యం తగదు

- ప్రజా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- నగర కమిషనర్ కీర్తి చేకూరి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్యంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. మంగళవారం నుంచి నగరంలో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. గత సోమవారం అందిన ఫిర్యాదులు, అర్జీలు పరిష్కారంపై విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై సీఎంఓహెచ్‌ని వివరాలు అడిగారు. ఆమె చెప్పిన సమాధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం కీలకమని, అటువంటి పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం సహించనని స్పష్టం చేశారు. బాధ్యులుపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎంఓహెచ్, ఎంహెచ్ఓ, ఎస్ఎస్‌లు తమ పరిధిలో పారిశుద్ధ్య మెరుగుకు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి సమావేశంలో అందించాలని ఆదేశించారు. ప్రజల నుంచి 79 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగానికి 35, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 12, ఉపా సెల్ విభాగానికి 3, అకౌంట్స్ విభాగానికి 8, పరిపాలన విభాగానికి 5 చొప్పున ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను నగరపాలక సంస్థ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఎస్ఈ శ్యామ్ సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్ఓలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నగర మహా సభను జయప్రదం చేయండి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తాడేపల్లి మంగళగిరి నగర మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రజక ఉద్యోగ, కార్మిక, వృత్తిదారులు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న తాడేపల్లి నేతాజీ సెంటర్‌లోని అమరజీవి మేకా అమరారెడ్డి భవన్‌లో మహా సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలోని ప్రతి రజక ఉద్యోగ, కార్మిక వృత్తిదారులు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీదారులందరూ ఈ మహాసభలో పాల్గొనాలని కోరారు. ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాగోలు శ్రీనివాసరావు, నరసింహరావు, కడియాల శ్రీను, బాబూరావు పాల్గొన్నారు.

సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలని వినతి


సమస్యను కమిషనర్‌కు వివరిస్తున్న ముత్యాలరావు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, సంక్రాంతి పండగ కానుక వెయ్యి రూపాయిలు చెల్లించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు నిర్వహించిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకాలం జీతం చెల్లింపునకు అంగీకరించి, జీఓ జారీ చేసిందని తెలిపారు. అయితే గుంటూరు నగరపాలక సంస్థ కార్మికులకు ఇంత వరకు సమ్మె కాలం జీతం, పండగ కానుక చెల్లించలేదని చెప్పారు.

రేపటి నుంచి సీపీఐ విస్తృత స్థాయి సమావేశం

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 17, 18వ తేదీల్లో ఉదయం 10 గంటలకు గుంటూరులోని మల్లయ్య లింగం భవన్‌లో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఈ సమావేశాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, సీపీఐ వైఖరిని వెల్లడిస్తారని చెప్పారు. సభ్యులందరూ సకాలంలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతరావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

పెండింగ్ ఫైల్స్‌పై నగర కమిషనర్ కీర్తి చేకూరి అసహనం

నెహ్రూనగర్: ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, నగర కమిషనర్ వ్యక్తిగత సెలవులో ఉన్నప్పుడు ఆయా విభాగాధిపతులు తమ విభాగ పనితీరు పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ విభాగాధిపతులపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం నుంచి ఇవ్వాల్సిన అనుమతులు, విభాగాల వారీగా పెండింగ్ ఫైల్స్‌పై కమిషనర్ అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకునే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వారం విభాగాధిపతుల నుంచి కింద స్థాయి అధికారుల వరకు రోజువారీ వర్క్ రిపోర్ట్ ఫొటోలతో సహా అందించాలని ఆదేశించారు. విభాగాల వారీగా ప్రజాసేవలు, సమస్యలకు సంబంధించిన ఫైళ్ల పరిష్కార జాప్యంపై సమీక్షించి, పెండింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల పరిష్కారంపై విభాగాధిపతులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గతంలో నగరపాలక సంస్థలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం జరిగిందని, రాష్ట్ర విజిలెన్స్ శాఖ నుంచి ఆయా పనులపై సమగ్ర నివేదిక అందించాలని లేఖ పంపారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విభాగాధిపతులు పూర్తిస్థాయి బాధ్యత వహించాల్సి ఉందన్నారు. కేవలం కింది స్థాయి అధికారుల రిమార్క్‌లతో సిఫార్స్ చేయాల్సిన అవసరం లేదని, అనుమతుల కోసం తమకు సిఫార్స్ చేసే ముందే తప్పనిసరిగా సదరు ఫైల్స్‌కి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, పనులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శ్యామ్‌సుందర్, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్ పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్‌గా వచ్చే డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని శిరంగిపాలెంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 178 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. డయేరియా నివారణకు జాగ్రత్తలను డాక్టర్ శాంతి వివరించారు. విరోచనాలు ఎక్కువగా అవుతున్నట్లయితే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొరికిన పర్స్ అందజేత

తాడేపల్లిరూరల్: కాజ గ్రామంలో నేషనల్ హైవే టోల్ గేట్ వద్ద తనకు దొరికిన పర్సును కాజ గ్రామ సర్వేయర్ స్టాలిన్ మంగళగిరి రూరల్ పోలీసులకు సోమవారం అందజేశారు. పర్స్ విజయవాడ కేఎల్‌రావ్ నగర్‌కు చెందిన ఎస్కే సమద్‌గా గుర్తించామని ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను కించపర్చడం తగదు


ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల తనిఖీ సమయంలో ఉపాధ్యాయులను కించపర్చే విధంగా మాట్లాడటం తగదని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ పేర్కొన్నారు. సోమవారం ఆర్జేడీ బి. లింగేశ్వరెడ్డి, డీఈవో పి.శైలజను వారి కార్యాలయాల్లో కలిసిన ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు వైఖరిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా రంగ ప్రగతికి ఉపాధ్యాయులకు మంచి సూచనలు, సలహాలు ఇస్తే స్వాగతిస్తామని, ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అయితే దీనికి విరుద్ధంగా సంతకం పెట్టలేదని, హెచ్ఎం సంతకం లేదని స్కూల్లో మెమో జారీ చేయడం సరికాదన్నారు. మహిళా ఉపాధ్యాయునులను ఇష్టారాజ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. గుంటూరు రూరల్ మండలంలోని లాల్ పురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని విభిన్న ప్రతిభావంతురాలు కాగా, ఆమెలోని లోపాన్ని కించపర్చే విధంగా మాట్లాడటం తగదన్నారు. అదే విధంగా శారదా నికేతన్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలితోనూ ఇదే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. సంబంధిత అధికారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులను కలసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు పి.లక్ష్మీనారాయణ, ఎస్.ఎస్.ఎన్.మూర్తి, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు పచ్చల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎన్. శ్రీనివాసరావు ఉన్నారు.

ఉపాధ్యాయులను కించ పర్చలేదు

పాఠశాలల తనిఖీ సమయంలో తాను ఉపాధ్యాయులను కించ పర్చే విధంగా వ్యవహరించలేదని గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విధి నిర్వహణలో భాగంగా పాఠశాలలో విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో మాట్లాడటం, ప్రశ్నించడం మినహా తాను వ్యక్తిగతంగా ఎవ్వరిని దూషించలేదని, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనపై కావాలనే ఈ విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్


విద్యార్థినికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 100 మంది విద్యార్థినులకు సోమవారం మంగళగిరి రోటరీ క్లబ్ శక్తి ప్రాజెక్ట్ పేరిట ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌ను అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ ఇంటర్నేషనల్ 3,150 డిస్ట్రిక్ గవర్నర్ కె.శరత్‌చౌదరి విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ టి.మహతి మాట్లాడుతూ సర్వైకల్ కాన్సర్స్ మహిళల్లో సంభవించే ప్రాణాంతక వ్యాధి అని, 9 నుంచి 14 సంవత్సరాల బాలికలకు వ్యాక్సినేషన్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఈ క్యాన్సర్ బారిన పడకుండా సులభంగా కాపాడుకోవచ్చన్నారు. రోటరీ గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌ను విద్యార్థినులు వినియోగించుకోవాలన్నారు. గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ సేవా కార్యక్రమాన్ని రోటరీ క్లబ్, రోటరీ కరవాలంబనం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా పైలెట్ ప్రాజెక్ట్‌గా శక్తి పేరిట మంగళగిరిలో చేపట్టడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీజీ అన్నె రత్నప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ, ఎంఈఓ-2 బాబు, హైస్కూల ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీనివాసరావు, ఇందిరానగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, క్యాన్సర్ అవేర్‌నెస్ సోషల్ అంబాసిడర్ రూపరాజు, ఎంఆర్కే ట్రస్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక వరం


కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న జనసేన నాయకులు

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం ఒక వరమని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకుడు తిరుమల శెట్టి కొండలరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తన కార్యాలయంలో ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, కార్మికులకు వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఇసుకను ఉచితంగా అందించే విధానాన్ని అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక కొరత వల్ల పనులు లేక కార్మికులు వలస వెళ్లిపోయారని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ దుగ్గిరాల మండల మాజీ అధ్యక్షుడు గూడూరు వెంకటరావు, నాయకులు రమేష్, నాగరాజు, బాషా, టైలర్ బాష, ఫిరోజ్ పాల్గొన్నారు.

కౌలు రైతుల సంతకాల సేకరణ


కౌలు రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్న సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెరికలపూడి, పెదపాలెం, పెదకొండూరు, గొడవర్రు, చిలువూరు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ, రైతుల వద్ద నుండి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలో వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2011 భూ ఆధీకృత కౌలు రైతు చట్టంలో మార్పు చేసి భూ యజమాని అనుమతి తప్పని సరి చేయడంతో అనేక మంది కౌలు రైతులు కౌలు కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు మంజూరు చేసి కౌలు రైతులకు ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం అందించేందుకు రైతుల సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రబాబు, కె.శ్రీనివాసరావు, డి.విజయలక్ష్మి, చంద్రశేఖర్, ఎం.రామ్‌చరణ్, ఎం.అంజయ్య, కె.దావీదు, శ్రీరామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్థానికులతో ఎమ్మెల్యే తేనీరు..



గుంటూరు మెడికల్: టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ సోమవారం సంగడిగుంట, చౌత్రా ఏరియాలో పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచి నీటి సరఫరా, మురుగు పారుదల, స్థానికంగా నెలకొన్న అనేక సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ నేతలు పద్మనాభం, సంకు శ్రీను, ప్రసాద్ కొత్తూరు వెంకట్, దొడ్డి నాగరాజు పర్యటనలో పాల్గొన్నారు.

ఆంధ్రులు గర్వించదగ్గ ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు



లక్ష్మీపురం: ఒక ఆచార్యుడిగా, ఇంజినీర్‌గా, కేంద్ర మంత్రిగా పని చేసిన ప్రతిభాశాలి కె.ఎల్ రావు జీవితం అత్యంత విశిష్టమైందని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఇంజినీర్ డాక్టర్ కె.ఎల్ రావ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఫాదర్ ఆఫ్ ఇండియన్ వాటర్ మేనేజ్‌మెంట్‌గా నాగార్జున సాగర్ ప్రాజెక్టు రూపకర్తగా భారత దేశానికి గణనీయమైన సేవలందించారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, విశ్రాంత ఇంజినీర్ పి.ఘన శ్యామాచార్యులు మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమైనవిగా పేర్కొన్న నాగార్జున సాగర్ డ్యాం, విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ కె.ఎల్ రావ్ మేధో సంపత్తికి నిదర్శనమన్నారు. అనంతరం పలువురు సంస్థ సభ్యులు ప్రసంగించి, నివాళులర్పించారు.

నగరంలో జోరు వాన


చంద్రమౌళి నగర్ రోడ్డులో నిలిచిన నీరు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ముసురుతో కూడిన జోరు వాన కురిసింది. సాయంత్రం వేళ వర్షం ఆగకుండా పడటంతో కార్యాలయాల నుంచి విధుల ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, చిరు వ్యాపారులు వర్షంలోనే తడుస్తు ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలోని కొన్ని లోతట్టు ప్రాంతాలు గుంతలమయంగా మారడంతో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులుగా మారాయి.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



మంగళగిరి: విద్యార్థుల్లో వస్తున్న మానసిక సమస్యలను పరిష్కరించేలా ఉపాధ్యాయులు ధ్రుడంగా ఉండేందుకు స్టెప్ (ఎస్‌టీఈపీ) ఆధ్వర్యంలో ఉచిత కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 10న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం 19 వ తేదీ వరకు తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలలో స్టెప్ ప్రిన్సిపల్ బీబీ కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు ఎం.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

శివాలయం అసిస్టెంట్ పూజారి మృతి



తాడేపల్లిరూరల్ : మంగళగిరి కొత్తపేటలోని శ్రీ గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అసిస్టెంట్ పూజారిగా పనిచేస్తున్న బూర్గుల శంకర శాస్త్రి సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివాలయంలో సుమారు 45 సంవత్సరాల నుంచి అసిస్టెంట్ పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. శంకర శాస్త్రి మృతదేహానికి పలువురు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పారు.